
# వర్షం కురిసిన రోజు

ముద్దంశెట్టి హనుమంతరావు



ఆకాశం, చిల్లులు పడిందేమోనన్న భ్రాంతి కలిగించేలా హోరున వర్షం కురుస్తోంది వాయుదేవుడికి వుక్రోషం వచ్చినట్లుగా, వుధృతంగా గాలి వీస్తోంది. వర్షానికి వీధుల్లో నీరు నిండి పారుతోంది గాలికి చెట్ల కొమ్మలు విరిగి పడుతున్నయ్. పూరి గుడిసెలు వూగిసలాడుతున్నయ్.

సుబ్బికి, తానుంటోన్న గుడిసె యేమైపోతుందోనన్న భయం పట్టుకుంది గుండెలు విపరీతంగా కొట్టుకున్నయ్. గుడిసెలోంచి బైటపడి సురక్షితమైన చోటుకి వెళ్ళిపోవాలనుకుంది అయితే యెక్కడికి వెళ్ళడం? తాను పనిచేస్తున్న ఇళ్ళన్నీ దూరంలో వున్నాయి ఆ విపరీత వాతావరణంలో అంత దూరం

వెళ్ళడం సాధ్యంకాదు. దగ్గర్లోవున్న ఒకే ఒక్క ఇల్లు, రామదాసుగారిది.

ఎదురుగా, కాస్తంత దూరంలో రామదాసు డాబా ఇల్లు అగుపిస్తోంది. రామదాసు, వయస్సు మళ్ళినవాడు. భార్య యెప్పుడో చనిపోయింది మళ్ళీ పెళ్ళి చేసుకోవడం మానేశాడు వున్న ఒక కొడుకునూ మద్రాసులో చదివిస్తున్నాడు. రామదాసుకి, మంచివాడన్న పేరుంది. అంతేకాదు— పేదసాదలంటే, జాలి చూపే మనిషి. అంచేత, అతనింటికి వెళ్ళి తలదాచుకోవాలనే నిర్ణయించుకుంది, సుబ్బి కనీసం వరండాలోనైనా తలదాచు కుందుకు ఆయన అభ్యంతరం చెప్పడని సుబ్బి విశ్వాసం

నిర్ణయించుకోవడమే తడవుగా, వున్న రెండు పాత చీరలు, రెండు పాత జాకెట్లు ఓ సంచీలో పెట్టింది గాలికి రెపరెప కొట్టుకుంటున్న తడికె తలుపు తీసింది హోరున గాలితోపాటు వర్షపు జల్లు లోపలికొచ్చింది గుడిసెముందంతా జలమయం ఏకధారగా కురుస్తోన్న వర్షానికి గాలితోడై, భూమ్యాకాశాలమధ్య ఓ పలుచటి తెల్లబట్ట అరవేసినట్టుగా వుందా దృశ్యం దూరపు వస్తువులేవీ స్పష్టంగా దృష్టికి అనడంలేదు. రామదాసుగారి డాబా ఇల్లు లీలగా అగుపిస్తోంది

ప్రాణం మీద తీపి, సుబ్బిలో సాహసాన్ని పురిగొల్పింది సంచి పట్టుకుని రామదాసు గారింటికేసి పరుగెత్తింది వర్షపుజల్లు కళ్ళల్లో పడుతున్నా లెఖ్కచెయ్యక, గాలి ఒత్తిడి ముందుకు పోనివ్వకుండా వున్నా, ప్రయత్నం మానక, రామదాసుగారిల్లు చేరుకుంది ఇంటి తలుపు మూసివుంది. వరండాలో అడుగుపెట్టింది, సుబ్బి. ఇంక తన ప్రాణానికి భయంలేదన్నట్టు 'హమ్మయ్య' అనుకుంది సంచీని క్రింద బెట్టి పూర్తిగా తడిసిన చీరను వీలున్న చోటంతా పిండింది ఆ తడిబట్టతోనే మొహాన్ని ఒత్తుకుంది.

ఇంటి తలుపు తెరిచిన శబ్దం విని సుబ్బి తడిచిన చీరలోంచి వుబుకుతోన్న అవయవాలను, అప్రయత్నంగా రెండు చేతుల్తో కప్పుకుంది రామదాసు, దగ్గరగా వచ్చాడు.

"నువ్వా సుబ్బీ!" అన్నాడు.

"ఔను బాబూ! గుడిసె కూలిపోద్దేవో అన్న భయంతో వచ్చేసినాను బాబూ! గాలోన పెట్టినట్టేవుంది తగ్గినాక యెల్లి పోతాను," అంది, సుబ్బి

రామదాసు, కళ్ళద్దాలు సవరించు కుంటూ ఆమెకేసి తదేకంగా చూశాడు. ఇన్నాళ్ళుగా ఆమె తనింట్లో పనిచేస్తున్నా ఆమెకేసి అలా చూడ్డం అదే మొదటిసారి. తడిసిన ఆమె చీరలోంచి, బింకమైన ఆమె అవయవాల పొంకం, యెంతో ఆకర్షణీయంగా అగుపిస్తూ వుంటే, స్త్రీని సృష్టించిన బ్రహ్మను ఓసారి మనసులో

అభినందించుకున్నాడు. అతనికి, తన యౌవనపు రోజులు గుర్తుకొచ్చినయ్. ఆ ఆలోచనలు సినీమా రీళ్ళల్లా మనో నయనాల ముందు కదిలేసరికి, తన్మ యత్వంలో పడిపోయాడు. ఆ తన్మ యత్వంలో, తన చర్య తప్పుగా వుందనే భావన లేకుండానే, సుబ్బి కేసే చూస్తున్నాడు.

రామదాసు చూపుల్లోని తీక్షతను భరించలేకపోయింది, సుబ్బి. అంతకు ముందెప్పుడూ, ఆయన తనకేసి అలా చూడలేదు. ఈ రోజు యెందుకలా చూస్తున్నాడు చెప్మా....? అన్న ఆలోచన రాగానే, స్త్రీ సహజమైన సిగ్గు, ఆమెను ఆవహించి, మొహం దించు కునేట్టు చేసింది. మనసులో యేదో భయం కలుక్కుమంది. మరింత చలితో వణికిపోయింది.

"అదేటి బాబూ, అలా సూత్తారు? నానేం కొత్తదాన్నికాను. తమరు రోజూ సూత్తన్న సుబ్బినే" అంది మెల్లగా. ఆమె గొంతు కంపించింది.

అప్పుడుగాని రామదాసు తన వూహా లోకంనుండి వాస్తవిక లోకానికి రాలేక పొయ్యాడు. గతుక్కుమన్నాడు. తనెంత నీచపుపనికి పాల్పడ్డాడు?.... అను కుంటూ చప్పున సంభాళించుకుని, మెల్లగా మందహాసం చేశాడు. "అబ్బే! నువ్వేం కొత్తమనిషివని అలా చూడ్డంలేదే! ఎప్పుడో కొన్నేళ్ళ క్రితం యిలాగే వచ్చిన గాలివాన, ఆనాటి సంఘటనలు, జ్ఞప్తికొచ్చాయి. అంతే! అం....అం.... అలా తడిబట్టల్తో వుంటే, జలుబు చేస్తుంది. వెళ్ళి బట్టలు మార్చుకో. సంచిలో చీరుందా?" అన్నాడు రామదాసు.


"వుందినెండి బాబూ!" నిజంగానే వణికిపోతోంది, సుబ్బి ఆమె అవస్థ చూసిన రామదాసుకి యెంతో జాలివేసింది.

"అయితే ఆలస్యమెందుకూ? లోపలి గదిలోకి పోయి, మార్చుకో." అన్నాడు.

సుబ్బి, కాస్తంత సందిగ్ధంలోపడింది. ఆమెకి యేదో చెప్పలేని భయం పట్టుకుని, అడుగులు ముందుకు వెయ్య నివ్వలేదు. రామదాసు వయస్సు మళ్ళిన వాడైనా, మంచివాడయినా, యిటువంటి వాతావరణంలో ఒంటరి మగాడు.... అన్న ఆలోచన, ఆమెలో ఒక స్తబ్దతను యేర్పర్చింది క్షణంపాటు. మొహం దించుకుని, నుంచుండిపోయింది వణుకు తూనే. తాను ఇల్లు వూడ్చడానికి, అంట్లు తోమడానికి రోజూ వచ్చినపుడు, రామ దాసు యెప్పుడూ ఒంటరివాడే. అప్పుడు రాని సందేహం, ఒకవిధమైన భయం, యిప్పుడు ఆమెలో యెందుకువచ్చినయ్యో ఆమెకి తోచలేదు. బహుశా, వాతావర ణమే కారణం కావచ్చునన్న నిజం తెలుసుకోలేకపోయింది.

రామదాసు, ఆమె సందిగ్ధతను పసిగట్టి నట్టున్నాడు. పొడిగా నవ్వేడు.

"ఏవింటే ఆ సంకోచం? నన్ను చూసి




భయపడుతున్నావా? ఎప్పుడూ లేంది, యీ రోజు నీలో యెందుక్కలిగిందా భయం? నేనిలా ఒంటరిగా వుండటం కొత్తకాదుకదా? పోతే, యీనాటి పరిస్థితి, వాతావరణం, వేరంటావు. అంతేనా? ఔన్లే! రోజులు, అట్లా వున్నాయి. నువ్వు భయపడ్డంలో తప్పులేదు. పిచ్చిదానా! అటువంటి భయమేం పెట్టుకోకు. వెళ్ళు" అన్నాడు.

ఆయనలా అంటూంటే, తానింకా మొరాయించుక్కూచోవడం బాగాలేదని పించింది సుబ్బికి. వర్షం వుధృతమౌతోంది. గాలి తగ్గుముఖం పడుతున్నట్టు తోచింది. పూర్తిగా తడిసిపోయిందేమో, గుండెల్లో వణుకు అధికమయ్యింది. అలా మరి కాస్సేపు తడిబట్టల్తోవుంటే, యింకే మైపోతుందోనన్న భీతి కలిగింది సుబ్బికి తడిబట్టలు మార్చుకోక తప్పదనుకుంది. సంచీ పట్టుకుని, తడబడే అడుగుల్తో లోపలికి నడిచింది.

రామదాసు లోపలికొచ్చి, తలుపు గడియవేశాడు. సుబ్బి తృళ్ళిపడింది. గడియవేసిన శబ్దం, ఆమె గుండెల్లో బాంబు ప్రేల్చినట్లయ్యింది. తొందరగా నడిచి, లోపలి గదిలోకిపోయి తలుపు మూసి, గడియవేసుకుంది. నిశ్చింతగా ఓ నిట్టూర్పు విడిచి, చీర మార్చుకుంది. జాకెట్టు కూడా మార్చుకుంది. అయినా, ఆమె గుండెల్లో యేదో గుబులుగానే వుంది. ఏపాటి చిన్న శబ్దం అయినా, బెంబేలు పడిపోయి ద్వారంకేసిచూస్తోంది. ఆ తుఫాను వాతావరణంలో, ఆ ఇంట్లో తనూ, రామదాసుగారూను! ఆయన యెంతో మంచివారన్న వుద్దేశంతోనే

తానిక్కడికి వచ్చిందీ వాతావరణంలో. అయితే, ఆయన తన తడిబట్టలకేసి చూసిన తీరు, యిప్పటికీ దడపుట్టిస్తోం దామెకి. యింత వుత్తముడనిపించుకున్న మనిషికి కూడా యిటువంటి పాడుబుద్ధే మిటి? అలా అయితే, మరి 'మంచి' అనే పదానికి అర్థం యేముంది? ఏవిఁటో యీ మనుషులు? ఎవర్ని యెలా నమ్మడమో, బోధపడదు. రామదాసుగారు తననిప్పుడు బలాత్కారించినా, తనేం చెయ్యగలదు? తన కేకలు యీ వాతావరణంలో వినే దెవరు?.... ఇలా సాగినయ్ ఆమె వూహాలు. సుబ్బికి గుండెలు మరింత జోరుగా కొట్టుకున్నట్టనిపించింది.

ఇహపోతే, రామదాసు విషయం— సుబ్బి బాగా తడిచినందుకు, యిటువంటి నిస్సహాయస్థితిలో తనింటికి వచ్చినందుకు అతనికి ఆమెపట్ల వల్లమాలిన జాలి కలిగింది. సుబ్బి తనింట్లో పనిచేసే పని మనిషే కావచ్చు. కాని, అదీ మనిషే! అన్న సమానత్వపుభావన అతనిలో మెదిలింది. ఫ్లాస్కులోవున్న కాఫీని కాస్తంత గ్లాసులో పోసి, ఆమె వున్న గది దగ్గరికి ఆ గ్లాసుతో వెళ్ళాడు, రామదాసు.

"సుబ్బీ...." పిలిచాడు మెల్లగా.

సుబ్బి పలుకలేదు. పలకదేవిఁటి?.... అనుకున్నాడు.

"సుబ్బీ.... తలుపు తియ్యవే!" మళ్ళీ కేకవేశాడు, రామదాసు.

సుబ్బి గుండెలు గుభేలుమన్నాయి. రామదాసుగారు యేదో చెడుతలంపుతో తలుపు తియ్యమంటున్నారన్న అపోహకు లోనై, కంగారుపడింది. ఆమె అపోహకు, అనుమానానికి, కాస్సేపటి క్రితం ఆయన వీధి తలుపు గడియ పెట్టడం, మరింత దోహదమయ్యిందంటే ఆశ్చర్యంకాదు. అయ్యగారింట్లో తాను చాలా రోజుల్నించి పనిచేస్తుంది. ఆయన కెప్పుడూ యిటువంటి పాడుబుద్ధి పుట్ట లేదే!.... అనుకున్న సుబ్బి, తలుపు తియ్యకూడదనే నిర్ణయించుకుంది. కనీసం పలకనైనా పలకలేదు. దృఢ నిర్ణయంతో మౌనం వహించింది.

రామదాసుకేమీ అర్థంకాలేదు. సుబ్బికి యేమయ్యింది? ఎందుకు పలకడంలేదు? చలికి తట్టుకోలేక స్పృహ తప్పిందా?...

"ఏవిఁటే సుబ్బీ, నిద్రపోతున్నావా యేవిఁటి? తలుపు తెరు...." యీసారి కాస్త గట్టిగా అరిచాడు, రామదాసు.

రామదాసు కేకలకి బెదిరిపోయింది, సుబ్బి. మొండికెత్తి, యింకా తలుపు తియ్యకుండా వుండే ధైర్యం లేక పోయిందామెకి. ఏమైతే అయ్యిందన్న ధైర్యాన్ని కూడదీసుకుని, మెల్లగా తలుపు తెరిచింది, ఆమె గుండెలు కొట్టుకుంటూ వుండగా.

ఎదురుగా చూసిన దృశ్యం, సుబ్బిని చకితురాల్ని చేసింది. రామదాసుగారు గ్లాసు పట్టుకుని నిల్చునున్నారు. తన

తొందరపాటు నిర్ణయానికి సిగ్గుపడి పోయింది. అతనికేసి మొహమెత్తి చూడలేక పోయింది. నేరం చేసినదానిలా మొహం దించుకుంది.

"నిద్రపోతున్నావా యేవిఁటే! ఎన్ని సార్లు పిల్చినా తియ్యవేం? వూఁ వర్షంలో బాగా తడిచావా మరి! జలుబు చేస్తుంది. ఈ వేడి కాఫీ తీసుకో...." అంటూ గ్లాసుని అందించాడు, రామదాసు.

వణుకుతున్న చేతుల్తో ఆ గ్లాసుని అందుకుంది.

"అదేవిఁటే అలా వణికిపోతున్నావు" అన్నాడు, రామదాసు.

"చలి బాబూ...." అంటూ కాఫీ తీసుకోవడం ప్రారంభించింది.

సుబ్బి మాటల్లో తొట్రుపాటు స్పష్టంగా ద్యోతకమౌతోంది. అది గ్రహించాడు, రామదాసు. చిన్నగా నవ్వాడు. "వర్షంలో తడిసిన చలికంటె, నీ మనసులో కలిగిన భయంవల్ల నీలో మరింత చలి పుట్టిందే సుబ్బీ! నువ్వెందుకు భయపడుతున్నావో, నాకు తెలుసు. ఎప్పుడూ లేని యీ భయం, యీ అనుమానం, నీలో యెందుకీ రోజు కలిగిందో నాకు అర్థంకావడంలేదు. ప్రతీ మగాణ్ణీ యీ దృష్టితో అంచనా వెయ్యడం పరిపాటయ్యిందీ రోజుల్లో. అయితే, మగాళ్ళంతా ఒకేలాంటి మనస్తత్వాన్ని కలిగివుంటారనుకోవడం శుద్ధ పొరపాటు. వాతావరణం యిలా వున్నంత మాత్రాన, నువ్వు ఒంటరిగా వున్నావని, పశుప్రవృత్తితో ప్రవర్తించే నీచత్వం నాలో లేదే సుబ్బీ! మనిద్దరం యీ ఇంట్లో మసలడం యిది మొదటిసారికాదు. ప్రతిరోజూ మసలుతున్నాం. ఎప్పుడూలేని కోరిక, యిప్పుడుతలెత్తుతుందనుకున్నావా? వాతావరణం మనిషిని మార్చలేదు. అదీ. నాలాంటివాణ్ణి. అంతగా దిగజారిపోయే మనస్తత్వం కాదు నాది. అటువంటి భయాన్ని నీ మనసులో పెట్టుకోకుండా, నిర్భయంగా వుండు." అంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయాడు రామదాసు.

సుబ్బి, లోలోన చాలా పశ్చాత్తాపపడింది. తాను రామదాసు గురించి అపోహపడినందుకు, ఆందోళనచెందినందుకు. నిశ్చింతగా కాఫీ తీసుకుని, గ్లాసు కడిగేసి అక్కడ పెట్టింది.

కొద్దిసేపటికి గాలి వుధృతం తగ్గింది. వర్షం తగ్గుముఖం పట్టింది. సుబ్బి తృప్తిగా నిట్టూర్చింది.



———